## యువకుడు అదృశ్యం



శ్రీనివాస్(ఫైల్)

మలక్‌పేట, మార్చి 21: ఇంటి నుంచి బయటికి వెళ్లిన యువకుడు అదృశ్యమైన సంఘటన మలక్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ జయంత్ కథనం ప్రకారం ..నర్సింహులు పదేండ్లుగా మూసారాంబాగ్ శాలివాహననగర్‌లో భార్య ఇద్దరు సోదరులతో కలిసి నివాసముంటున్నారు. కాగా అతడి సోదరుడు శ్రీనివాస్ టైల్స్ వర్క్ చేసేవాడు. కాగా నెల 18న సాయంత్రం నాలుగు గంటలకు ఇంటినుంచి బయటికి వెళ్లిన శ్రీనివాస్ తిరిగి రాకపోవటంతో ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు అన్నిచోట్ల వెతికిన ఆచూకీ లభించకపోవటంతో బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ జయంత్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## డ్రైనేజీ సమస్యకు పరిష్కారం

గోల్నాక: డివిజన్ అన్నపూర్ణనగర్, శంకర్‌నగర్ తదితర ప్రాంతాల్లో డ్రైనేజీ సమస్యతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై కార్పొరేటర్ దూసరి లావణ్య గౌడ్‌కు వారు ఫిర్యాదు చేయగా ఆమె ఆదేశాలతో గురువారం సమస్యను బీఆర్ఎస్ నాయకుడు దూసరి శ్రీనివాస్ గౌడ్ పరిశీలించారు. వెంటనే సం బంధిత అధికారులతో మాట్లాడి మ్యాన్ హోళ్లలో పేరుకు పోయిన వ్యర్థాలను తొలగింప చేయించి స మస్యను పరిష్కరించారు.

# ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించాలి

### ఆర్డీవో సూరజ్ కుమార్



కందుకూరులో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నికల అధికారి ఆర్డీవో సూరజ్ కుమార్

కందుకూరు. మార్చి 21 : పార్లమెంట్ ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించడానికి కృషి చేయాలని నియోజకవర్గం ఎన్నికల అధికారి కందుకూరు ఆర్డీవో సూరజ్ కుమార్ తెలిపారు. మండల పరిషత్ సమావేశపు హాల్‌లో గురువారం సెక్టోరల్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని వారికి అవగాహన కల్పించారు. ప్రతి సెక్టోరల్ అధికారి తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలను సందర్శించి కనీస వసతులను కల్పించడానికి కృషి చేయాలని కోరారు. ఓటర్లతో మాట్లాడి పోలింగ్ సమయంలో ఎదుర్కొనే సమస్యలను తెలుసుకొని పరిష్కరించాలని కోరారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి ప్రతి ఒక్కరికీ వర్తిస్తుందని తెలిపారు.స్వేచ్ఛగా న్యాయబద్ధ ఎన్నికల నిర్వహణకు కృషి చేయాలని సూచించారు.బాధ్యతాయుతంగా పని చేయాలని పేర్కొన్నారు. మహేశ్వరం అడిషనల్ డీసీపీ సత్యనారాయణ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించడానికి కృషి చేస్తున్నామన్నారు. అందుకు సంబంధించిన ఏర్పాట్లను చేసినట్లు వివరించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. పోలింగ్ సమయంలో అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. నియోజవర్గంలో అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. మహేశ్వరం డివిజన్ ఏసీపీ లక్ష్మీకాంత్‌రెడ్డి, కందుకూరు, బాలాపూరు తహసీల్దార్‌లు గోపాల్, మాధవిరెడ్డి, నాయబ్ తహసీల్దార్ శేఖర్, ఎంపీడీఓలు సరిత, శైలజ సెక్టోరల్ అధికారులు, సీఐలు, ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.



మట్టి తొలగింపు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

## మట్టికుప్పలు, వ్యర్థాలు తొలగింపు

ఎల్బీనగర్ , మార్చి 21: రోడ్డుపైన పేరుకుపోయిన మట్టికుప్పలు, అభివృద్ధి పనుల సందర్భంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో జీహెచ్ఎంసీ అధికారులు స్పెషల్ డ్రైవ్‌తో మట్టి దిబ్బలను తొలగించారు. కొత్తపేట గాయత్రీపురం చౌ రస్తా నుంచి నాగేశ్వర్‌రావు కాలనీ, ఎస్ఆర్ఎల్ కాలనీ, సత్యనగర్ కాలనీల రోడ్డులో మట్టికుప్పలను పూర్తిగా తొలగించారు. ఈ పనులను కొత్తపేట కార్పొరేటర్ పవన్‌కుమార్ పరిశీలించారు. బాక్స్ డ్రెయిన్ పనులను కూడా పూర్తి చేయాలని అధికారులను కోరారు.

## డ్రైనేజీ సమస్యలను పరిష్కరిస్తా



డ్రైనేజీ సమస్యను తెలుసుకుంటున్న కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి

హయత్‌నగర్, మార్చి 21 : కాలనీలో అస్తవ్యస్తంగా మారిన డ్రైనేజీ పునరుద్ధరణ పనులు చేయిస్తానని హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అన్నారు. గురువారం హయత్‌నగర్ డివిజన్‌లోని బంజారాకాలనీలో కార్పొరేటర్ నవజీవన్ రెడ్డి, స్థానికులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలోని పలు వీధుల్లో డ్రైనేజీ నిండిపోయి కాలనీవాసులు ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. సంబంధిత అధికారులతో చర్చించి డ్రైనేజీ పునరుద్ధరణ పనులు చేయించేలా చర్యలు చేపడుతానని హామీ ఇచ్చారు. బాలు నాయక్, శంకర్, భరత్ పాల్గొన్నారు.

## ఆడబిడ్డల వివాహాలకు ఉప్పల ఫౌండేషన్ చేయూత



ఆర్థిక సహాయం అందజేస్తున్న రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌గుప్త

మన్సూరాబాద్, మార్చి 21: ఇరవై ఐదు సంవత్సరాలుగా నిరుపేద కుటుంబాల్లో జరుగుతున్న వివాహాలకు ఉప్పల ఫౌండేషన్ సంస్థ ద్వారా చేయూతనిస్తున్నట్లు రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్త తెలిపారు. సికింద్రాబాద్‌కు చెందిన రుచికా, నల్గొండ జిల్లా అంతంపేటకు చెందిన మల్లేశ్వరి, నాగోల్, బండ్లగూడకు చెందిన శ్రావణి, వరంగల్, జనగాంకు చెందిన మౌనిక వివాహాలు ఇటీవల నిశ్చయమయ్యాయి. నాలుగు కుటుంబాల ఆర్థిక పరిస్థితిపై కొందరు సన్నిహితులు తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్త దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఆయన నిరుపేద కుటుంబాల్లో జరుగుతున్న వివాహాలకు ఆర్థిక సహాయం అందించేందుకు ముందుకు వచ్చారు. నాగోల్, కోఆపరేటివ్ బ్యాంకు కాలనీలోని తన క్యాంపు కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నాలుగు కుటుంబాలకు చెందిన పెండ్లి కూతుర్లకు పుస్తె, మట్టెలు, చీర, గాజులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కోటగిరి చంద్రశేఖర్, సునీత, యాదయ్య, స్వరూప, మల్లేశ్, వెంకటేశ్, చంద్రశేఖర్‌గుప్త, శంకర్‌గుప్త, చంద్రశేఖర్ రావు, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

## దెబ్బడగూడ రోడ్డుకు రూ 2.50 కోట్లు మంజూరు



మాజీ జడ్పీటీసీ జంగారెడ్డి దంపతులతో కలిసి మాట్లాడుతున్న మంత్రి సీతక్క

కందుకూరు. మార్చి 21 : కందుకూరు-దెబ్బడగూడ రోడ్డుకు రూ. 2.50కోట్ల రూపాయలను మంజూరు చేస్తున్నట్లు రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క తెలిపారు. ఈ నెల 4వ తేదీన నమస్తే తెలంగాణలో అధ్వానంగా కందుకూరు, దెబ్బడగూడ రోడ్డు అనే కథనానికి స్పందించిన మాజీ జడ్పీటీసీ ఏనుగు జంగారెడ్డి, మాజీ సర్పంచ్ ఏనుగు శ్రావణి మంత్రి దృష్టికి తీసుకవెళ్లడంతో వెంటనే నిధులు మంజూరు చేస్తూ బీటీ రోడ్డుగా మారుస్తున్నట్లు తెలిపారు. ప్రతి గ్రామానికి రోడ్డు వసతిని కల్పిస్తామని తెలిపారు. రోడ్ల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం నిధులను కేటాయిస్తుందని మంత్రి తెలిపారు.



## సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన జంగారెడ్డి

కందుకూరు. మార్చి 21 : సీఎం రేవంత్‌రెడ్డిని మాజీ జడ్‌పీటీసీ. ఏనుగు జంగారెడ్డి. ఆయన సతిమణి మాజీ సర్పంచ్ ఏనుగు శ్రావణిలు కలిశారు. గురువారం ఆయన నివాసానికి వెల్లి వాలువాతో ఆయనను సన్మానించిన అనంతరం మండల అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరారు. అందుకు ఆయన అంగీకరించినట్లు జంగారెడ్డి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. రాజకీయాలకతీతంగా అభివృద్దే లక్ష్యమని తెలిపినట్లు వివరించారు. వారి వెంట ఏనుగు అక్షిత్‌రెడ్డి. కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపిద్దాం



మాట్లాడుతున్న బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్‌శర్మ

ఆర్కేపురం, మార్చి 21 : చేవెళ్ల పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపిద్దామని మహేశ్వరం నియోజకవర్గం బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్‌శర్మ అన్నారు. ఈ నెల 24న మీర్‌పేట్ ఎస్‌వైఆర్ గార్డెన్స్‌లో నిర్వహించే సన్నాహక సమావేశంపై గురువారం గ్రీన్‌హిల్స్ కాలనీలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పదవులు అనుభవించి పార్టీ మారడం బాధాకరమన్నారు. వంద రోజుల కాంగ్రెస్ పాలనలో ప్రజలందరూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఇంతవరకు రైతు బంధు ఇవ్వలేకపోయారని తెలిపారు. కేసీఆర్ హయాంలో వేసిన 30వేల ఉద్యోగ నోటిఫికేషన్‌లను తమ ప్రభుత్వమే నోటిఫికేషన్లు ఇచ్చి ఉద్యోగాలు ఇచ్చామని చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల నగేశ్, నాయకులు మారోజు రామాచారి, కొంద్ర శ్రీనివాస్, శ్రీమన్నారాయణ, వెంకటేశ్‌గౌడ్, కంచర్ల శేఖర్, పెంబర్తి శ్రీనివాస్, దుబ్బాక శేఖర్, ముచ్చితంల జగన్, వాజీద్ పటేల్, బాలునాయక్, బుజ్జిబాయి, కల్పన, హేమ, రేవతి తదితరులు ఉన్నారు.

## సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు



మలక్‌పేట, మార్చి 21: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కాంగ్రెస్ పార్టీ వికలాంగుల విభాగం రాష్ట్ర చైర్మన్ ముత్తినేని వీరయ్య కృతజ్ఞతలు తెలిపారు. తనను రాష్ట్ర వికలాంగుల సహకార సంస్థ(కార్పొరేషన్) చైర్మన్‌గా నియమించటంతోపాటు పెరిక కుల కార్పొరేషన్ ఏర్పాటు చేసినందుకుగాను గురువారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని తన నివాసంలో కలిసిన ఆయన పుష్పగుచ్ఛాన్ని అందించి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పెరిక కుల కార్పొరేషన్ ఏర్పాటుచేసి సమస్త పెరిక కుల అభివృద్ధికి పునాదులు వేసినందుకుగాను పెరిక కులస్తులు కాంగ్రెస్ పార్టీకి జీవితాంతం రుణపడి ఉంటారని ఆయన తెలిపారు. వికలాంగుల, పెరిక కుల సంక్షేమం కోసం నిరంతరం పాటుపడాలని ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి సూచించినట్లు వీరయ్య తెలిపారు.

## పుస్తకాలను చదవడం అలవాటు చేసుకోవాలి



పేరిణి పంచాంగాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్

కందుకూరు. మార్చి 21 : పుస్తకాలను చదవడం అలవాటు చేసుకోవాలని ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ తెలిపారు. గురువారం కందుకూరు మండల పరిధిలో గల చిప్పలపల్లిలో గల విద్యారణ్యం వేద పాఠశాలలో నిర్వహించిన పద్మశ్రీ డాక్టరు నటరాజ రామక్రిష్ణ జయంతి ఉత్సవంలో డాక్టరు ఫణికుమార్ పరిశోధన గ్రంథం పేరిణి పంచాంగములు పరిణామ క్రమం ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పుస్తక పఠాన్ని అలవాటు చేసుకోవాలని సూచించారు. పుస్తకాలను చదవడం అలవాటు చేసుకుంటే విజ్ఞానం పెరుగుతుందని వివరించారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ విద్యకు ప్రాధాన్యత ఇచ్చినట్లు పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వేద పాఠశాలను ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. ప్రవీణ్ కుమార్, సామ పాల్గొన్నారు.

## స్కూల్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే



ఎల్బీనగర్ , మార్చి 21: లింగోజిగూడ సాయినగర్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన వ్యాఖన్ ప్లే స్కూల్‌ని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ నిర్వాహకురాలు మధుమతి, డివిజన్ అధ్యక్షుడు వరప్రసాద్‌రెడ్డి, మధుసాగర్, సత్యనారాయణగౌడ్ అనిల్‌రెడ్డి, కొండల్, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

## కాలనీ సమస్యలు పరిష్కరిస్తా: ఎమ్మెల్యే



ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

**ఉప్పల్, మార్చి 21:** కాలనీ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టామని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. ఉప్పల్ లక్ష్మీనారాయణకాలనీలోని డ్రైనేజీ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కాలనీవాసులు గురువారం ఎమ్మెల్యేను కలిశారు. ఈ సందర్భంగా సమస్యలను వివరిస్తూ వినతిపత్రం అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనులు పూర్తిచేస్తున్నామని చెప్పారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తామని పేర్కొన్నారు. కాలనీల్లో మౌలిక సమస్యలను సత్వరం పరిష్కరించేలా సమన్వయంతో ముందుకుసాగుతామన్నారు. కాలనీలోని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి త్వరలోనే పరిష్కరించేలా చూస్తామన్నారు. కాలనీల్లో నీటి, డ్రైనేజీ, రోడ్డు ఇబ్బందులు లేకుండా తగిన నిధులు తీసుకువస్తామన్నారు. సమస్యలను తనదృష్టికి తీసుకువస్తే, తప్పక పరిష్కరించేలా చూస్తామన్నారు.

ఈ కార్యక్రమంలో కాలనీవాసులు పాయసం గోపాల్, రవీందర్, యాదగిరియాదవ్, శివరెడ్డి, శివకుమార్, రాఘవేందర్, తదితరులు పాల్గొన్నారు.



## అనాథ విద్యార్థి గృహంలో అన్నదానం

ఆర్కేపురం, మార్చి 21 : హీరో శోభన్‌బాబు 16వ వర్ధంతి సందర్భంగా శోభన్ బాబు సేవా సమితి తెలంగాణ ఫౌండర్ చైర్మన్ పి.వి.శేషందర్‌రావు ఆధ్వర్యంలో ఎల్బీనగర్ చిత్రలేఅవుట్ కాలనీలోని అనాథ విద్యార్థి గృహంలో విద్యార్థులకు అన్న ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో శంకర్‌రావు, మురళీ, యాదగిరి, జగదీశ్ మురళీధర్‌రెడ్డి, రాజేశ్‌గౌడ్, రాంమ్మోహన్‌రావు, శైలైందర్ తదితరులు ఉన్నారు.

## సీఎంకు సన్మానం



బడంగ్‌పేట్, మార్చి 21 : రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన చల్లా నర్సింహారెడ్డి సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. నర్సింహారెడ్డి వెంట కవితబాల్‌రెడ్డి, మౌనిక శ్రీశైలం, చల్లా శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేశ్‌గౌడ్, విజయరెడ్డి, యాదిరెడ్డి, సుభాశ్‌రెడ్డి ఉన్నారు.

## హెచ్ఐవీ నివారణపై అవగాహన



ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌ను సన్మానిస్తున్న ప్రోగ్రాం ప్రతినిధులు

**రామంతాపూర్,మార్చి 21:** ఉప్పల్ లిటిల్ ఫ్లవర్ డిగ్రీ కళాశాలలో గురువారం తెలంగాణ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ టీఎస్ఏసీఎస్ ఉస్మానియా విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ సెల్ సంయుక్తంగా హెచ్ఐవీ నివారణ పేరుతో రెడ్ రిబ్బన్ క్లబ్ పీర్ లీడర్స్ కన్వెన్షన్ నిర్వహించారు. జిల్లా నుంచి 200 మంది ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు. ఎన్ఎస్ఎస్ యూత్ స్టేట్ కోర్డినేటర్ రమేశ్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రవికుమార్, రిటైర్డు డిప్యూటీ డైరెక్టర్ నర్సింహస్వామి మాట్లాడుతూ హెచ్ఐవీ ఒకరి నుంచి మరొకరికి ఎలావ్యాప్తి చెందుతుందో వివరించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ జయంతి,ఎన్ఎస్ఎస్ పీవో ప్రశాంత్,తదితరులు పాల్గొన్నారు.

## సరూర్‌నగర్ డివిజన్ బీజేపీ కన్వీనర్‌గా శ్రీవాణి



ఆర్కేపురం, మార్చి 21 : సరూర్‌నగర్ డివిజన్ బీజేపీ కన్వీనర్‌గా ఆకుల శ్రీవాణి నియమితులయ్యారు. ఈ మేరకు రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా శ్రీవాణి మాట్లాడుతూ రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పని చేస్తామని తెలిపారు. బీజేపీ నాయకులను, కార్యకర్తలను కలుపుకొని డివిజన్‌లో ఎంపీ అభ్యర్థికి 15వేల ఓట్లు వేయించే విధంగా ముందుకు సాగుతామని తెలిపారు. కేంద్రంలో నరేంద్రమోడీ నాయకత్వంలో మరోసారి బీజేపీ ప్రభుత్వం ఏర్పడుతుందన్నారు. తన నియామకానికి సహకరించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, రాజ్యసభ ఎంపీ లక్ష్మణ్‌కు ప్రత్యేక కృతజ్ఞతులు తెలిపారు.

## సోషల్ మీడియాకు దూరంగా ఉండాలి



చిన్నారులకు సర్టిఫికెట్లను అందజేసిన సీఐ వెంకటేశ్వర్లు, డీన్ శ్రీనివాస్, నరసింహ

ఆర్కేపురం, మార్చి 21 : విద్యార్థులు సోషల్ మీడియాకు దూరంగా ఉండి చదువుపై శ్రద్ధ వహించి మంచి భవిష్యత్తును నిర్మించుకోవాలని చైతన్యపురి సీఐ వెంకటేశ్వర్లు అన్నారు. ఆర్కేపురం డివిజన్ గౌతమ్ మోడల్ స్కూల్ గ్రాడ్యుయేషన్ యాన్యువల్ డే వేడుకలను కొత్తపేటలోని బాబూ జగ్జీవన్ రామ్ భవన్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీఐ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల దశ నుంచే విద్యార్థులకు క్రమశిక్షణ, దేశభక్తి నేర్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు. తల్లిదండ్రులు వారి పిల్లలను వారికి నచ్చిన రంగంలోనే ప్రోత్సహించాలని సూచించారు. ఎలాంటి ఒత్తిడి లేని చదువులను చదువుతేనే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని తెలిపారు. పాఠశాల డీన్ శ్రీనివాస్ మాట్లాడుతూ తల్లిదండ్రులు ప్రతి రోజు తమ పిల్లలతో కొద్ది సమయం గడుపుతూ చదువు పట్ల శ్రద్ధవహించేలా చూడాలన్నారు. తమ పాఠశాలలో చదివే విద్యార్థులకు ఉన్నత ప్రమాణాలతో బోధన చేసి విద్యపై ఆసక్తి పెంపొందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. హెచ్ఎం నరసింహ ఉన్నారు.



మాట్లాడుతున్న ఆర్. కృష్ణయ్య, పాల్గొన్న గుజ్జ కృష్ణ, భరత్‌కుమార్, తదితరులు

## రేపటి నుంచి బీసీ జోడో సామాజిక న్యాయయాత్ర

కాచిగూడ, మార్చి 21: తెలంగాణలోని 33 జిల్లాలలో ఈ నెల 23వ తేదీ నుంచి బీసీ జోడో సామాజిక న్యాయ యాత్రను నిర్వహించనున్నట్లు రాజ్యసభ సభ్యుడు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య అన్నారు. జాతీయ బీసీ యువజన సంఘం అధ్యక్షుడు గవ్వల భరత్ కుమార్ అధ్యక్షతన, జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ ఆధ్వర్యంలో గురువారం కాచిగూడ అభినందన్ హోటల్‌లో రాష్ట్రాల బీసీ సంఘాల నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆర్. కృష్ణయ్య హాజరై మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు బీసీలకు 10 సీట్లు కేటాయించి, బీసీ డిమాండ్లపై విధి, విధాన ప్రకటన చేసి మ్యానిఫెస్టోలో ప్రకటించాలని డిమాండ్ చేశారు. బీసీలకు 56 కార్పొరేషన్లను కేటాయించాలని డిమాండ్ చేశారు. వెంకటేశ్‌గౌడ్, జీడయ్యగౌడ్, సతీశ్, విశాల్, శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## పూజారులకు గౌరవ వేతనం అందజేత

గోల్నాక, మార్చి 21: నియోజకవర్గంలోని పలు ఆలయాల్లో ప్రతి రోజూ ధూపదీప, నైవేద్యం సమర్పిస్తున్న పూజారులకు ప్రతి నెలా ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ గౌరవ వేతనం అందజేస్తున్న విషయం తెలిసిందే.. గురువారం గోల్నాక క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఈ నెలకు సంబంధించి 11 మంది పూజారులకు రూ. 5 వేల చొప్పున అందజేశారు.

## ఆర్టీసీ బస్సు ఢీ.. వృద్ధుడు మృతి

మన్సూరాబాద్, మార్చి 21: రోడ్డు దాటుతుండగా అతి వేగంగా వచ్చిన ఆర్టీసీ బస్సు ఢీకొట్టిన ఘటనలో వృద్ధుడు మృతి చెందాడు. ఈ సంఘటన ఎల్బీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. సూర్యాపేట జిల్లా, మునగాల గ్రామానికి చెందిన పలపాటి రాధయ్య (80) ఎల్బీనగర్, సరూర్‌నగర్, బహదూర్‌గూడలో ఉండే కుమారుడి వద్దకు వచ్చాడు. ఎల్బీనగర్ రింగ్‌రోడ్డు వద్ద గురువారం సాయంత్రం రోడ్డు దాటుతుండగా ఉప్పల్ బస్సు డిపోకు చెందిన బస్సు ఢీ కొట్టింది. రాధయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. బస్సు డ్రైవర్ చింతకింది నరేశ్ అజాగ్రత్తగా నడపడం వల్లే తన తండ్రి మృతి చెందాడంటూ మృతుడి కుమారుడు శ్యాంసుందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.